నేడు భూసేకరణపై గ్రామ సభలు

జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి

సాక్షి,సిటీబ్యూరో: నగరంలోని ప్యారడైజ్ జంక్షన్ నుంచి శామీర్‌పేట్ ఓఆర్ఆర్ జంక్షన్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూసేకరణ, పునరావాస, ఉపాధికల్పన కోసం గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) విజయేందర్‌రెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. మేడ్చల్, మల్కాజిగిరి జిల్లా అల్వాల్ మండలంలోని అల్వాల్, లోతుకుంటలకు సంబంధించిన గ్రామసభను ఈనెల 20న ఉదయం 10.30 గంటలకు అల్వాల్‌లోని సిద్దార్థ వినాయక విద్యానికేతన్, ఐటీఐ కళాశాలలో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. శామీర్‌పేట మండలంలోని హకీంపేట్, దేవరయంజాల్, తూముకుంటకు సంబందించిన గ్రామసభ ఈనెల 20న ఉదయం 11.30గంటలకు తూముకుంట మున్సిపల్ కార్యాలయంలో నిర్వహిస్తున్నట్లు ప్రకటించారు. అభ్యంతరాలు ఉంటే సంబంధిత ప్రాంతాలు, బస్తీలు, గ్రామాల ప్రజలు నిర్దేశించిన గ్రామసభలకు హాజరుకావాలని ఆయన సూచించారు.

ఆశావర్కర్ల అరెస్ట్

శామీర్‌పేట్: ఆశా కార్యకర్తల హక్కుల సాధనకు కలెక్టరేట్‌ల ముట్టడికి సీఐటీయూ పిలుపునిచ్చింది. దీంతో బుధవారం మేడ్చల్ కలెక్టరేట్ ముట్టడికి యత్నించిన ఆశావర్కర్లను పోలీసులు అరెస్ట్ చేసి శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరుగుతున్నందున ఆశావర్కర్లకు బడ్జెట్‌లో నిధులు కేటాయించి డిమాండ్లను నెరవేర్చాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉమ్మడి శామీర్‌పేట మండలంతో పాటు, కీసర మండలంలోని ఆశా వర్కర్లను అరెస్ట్ చేసి శామీర్‌పేట పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం



ఘట్‌కేసర్: ఏబీసీడీ వర్గీకరణ కోసం అలుపెరగని పోరాటం చేసిన ఉద్యమ నేత మందకృష్ణ మాదిగ చిత్రపటానికి దళిత నాయకుల ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తాలో బుధవారం పాలాభిషేకం చేశారు. నరేందర్, శివకుమార్, నగేష్‌మాదిగ, శ్రీనివాస్, మధు, అంజనేయులు, శ్రీనివాస్, సుధాకర్, మోహన్‌రావు పాల్గొన్నారు.

మేడ్చల్: పట్టణంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఎమ్మార్పీఎస్ నాయకులు మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. పరుశురాం, సాయిలు, నర్సింహ్మా, శివకుమార్, రామకృష్ణ, బాలనర్సింహ్మా, ఆనంద్, భానుచందర్, రాజ్‌కుమార్, రాజు తదితరులున్నారు.


కీసర: రాంపల్లిలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం నిర్వహించారు. గత 30 ఏళ్లుగా ఆయన చేసిన చేసిన పోరాట ఫలితమే ఎస్సీ వర్గీకరణ బిల్లు అసెంబ్లీలో అమోదం పొందిందన్నారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు మహేందర్, మాజీ ఎంపీపీ రామారం సుజాత, శ్రీనివాస్, పెంటయ్య, కొమ్ము సుదర్శన్, పరమేష్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థిని అదృశ్యం

కాలేజీ బస్సు డ్రైవర్‌పై అనుమానంతో ఫిర్యాదు

పోచారం: బీటెక్ విద్యార్థిని అదృశ్యమైన ఘటన పోచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు తెలిపిన ప్రకారం.. అన్నోజిగూడలో ఉంటున్న దీపిక (20) బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతోంది. మంగళవారం సాయంత్రం ఇంట్లో ఎవరికీ చెప్పకుండా బయటకు వెళ్లి తిరిగి రాలేదు. పలుచోట్ల వెతికినా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తండ్రి తిరుపాళ్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాలేజీ బస్సు డ్రైవర్‌తో ఆమె ఎక్కువగా ఫోన్‌లో మాట్లాడేదని చెబుతున్నారు. అతడిపై అనుమానం ఉందని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

'మోడల్' ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న ఎంపీడీఓ గీతారెడ్డి

శామీర్‌పేట్: మూడుచింతలపల్లి మండల కేంద్రంలోని చేపట్టిన ఇందిరమ్మ మోడల్ (డెమో) ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణ పనులను ఎంపీడీఓ గీతారెడ్డి బుధవారం పరిశీలించారు. రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకంలో భాగంగా నిర్మిస్తున్న ఇంటికి ప్రధాన ద్వారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకంలో మోడల్ ఇందిరమ్మ ఇళ్లను నిర్మించి లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్నట్లు వివరించారు. అర్హులైన నిరుపేదలకు ప్రభుత్వ ఆదేశాల ప్రకారం అందజేయనున్నట్లు ఆమె చెప్పారు. హౌసింగ్ ఏఈ అల్లాజీ, ఎంపీఓ మంగతాయారు, కార్యదర్శి రాజేశ్వర్‌రెడ్డి, ఏఈఓ లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.



కూల్చివేయడంతో కళావిహీనంగా..



శిథిలావస్థలో గురుకుల్ భవనం

చెరిగిపోతున్న ఆనవాళ్లు !

ఒకప్పుడు వేలాది మంది పేద విద్యార్థులకు విద్యనందించిన గురుకుల విద్యాలయం నేడు శిథిలావస్థకు చేరుకుంది. స్వాతంత్ర్యానికి ముందే విద్యా వెలుగులు నింపిన 'గురుకుల్' నేడు రూపు రేఖలను కోల్పోతుంది. పేదలు విద్యకు దూరం కాకూడదనే ఓ మహానుభావుడి ఆశయంతో ఘట్‌కేసర్‌లో ఏర్పాటు చేసిన గురుకుల్ విద్యాలయంలో నేడు కూలిన భవనాలే దర్శనమిస్తున్నాయి. కోట్లాది రూపాయల ఆస్తులున్న విద్యాలయం నిర్వాహణకు పైసా అందని దుస్థితి నెలకొంది. అన్యాక్రాంతమవుతున్నా పట్టించుకునే వారే కరువయ్యారు. – ఘట్‌కేసర్



ఘట్‌కేసర్ గురుకుల్ ముఖద్వారం



గురుకుల్ వ్యవస్థాపకులు బన్సీలాల్ వ్యాస్‌జీ

- వేలాది మంది జీవితాల్లో వెలుగులు నింపిన గురుకుల్
- భన్సీలాల్ వ్యాస్‌జీ ఆశయానికి తిలోదకాలు
- కూల్చివేస్తున్నా పట్టించుకునే వారు కరువు

పేదల కోసం స్థాపన..

పేదలు విద్యలో వెనకపడకూడదని, వారికి ఉచితంగా విద్యను అందించాలని సంఘ సేవకుడు, ఆర్యసమాజ్ సభ్యుడు బన్సీలాల్ వ్యాస్‌జీ నగరంలోని రాంబాగ్‌లో 1938లో గురుకుల్‌ను ఏర్పాటు చేశారు. అనంతరం అక్కడ సౌకర్యాల లేమి కారణంగా 1942లో ఘట్‌కేసర్‌కు తరలించారు.

26 ఎకరాల భూమి దానం..

మొదట హిందీలో జరిగిన బోధన స్థానికంగా తెలుగు వారు ఎక్కువగా ఉండటంతో 7వ తరగతి నుంచి తెలుగు మీడియంలో బోధించేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి తీసుకున్నారు. అనంతరం 1955–56లో 8వ తరగతి, అనంతరం 9, 10 తరగతులు పెంచుతూ.. 1972లో గురుకుల్ జూనియర్ కళాశాలను ఏర్పాటు చేశారు. బన్సీలాల్ వ్యాస్‌జీ 1956లో రైలు ప్రమాదంలో మరణించిన అనంతరం గురుకులం పూర్వవైభవం కోల్పోయింది. 1989లో దేవాదాయశాఖ వారు స్వాధీనం చేసుకున్నారు. నగరంలోని మాదాపూర్, హైటెక్‌సిటీలో ఉన్న వందలాది ఎకరాల భూమి అన్యాక్రాంతమైంది.

ఆదాయంపై ఆసక్తి.. అభివృద్ధి గాలికి..

దేవాదాయ శాఖ ఆధీనంలో ఉన్న ఈ గురుకులం అభివృద్ధిని గాలికి వదిలేయడంతో పాఠశాల, జూనియర్ కళాశాల, హాస్టల్ భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. అధ్యాపకులు, ఉపాధ్యాయుల నియామకాలు నిలిచిపోయాయి. దీంతో విద్యార్థులు రావడం మానేశారు.

ముఖద్వారం కూల్చివేత...

ప్రజా ప్రతినిధులు గురుకులాన్ని అభివృద్ధి చేయాల్సింది పోయి అందిన కాడికి దోచుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి. స్థానిక నాయకుల గ్రూపు రాజకీయాలతో గురుకుల్ అభివృద్ధి ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా మారింది. గురుకుల్ వద్ద నిర్మిస్తున్న రైల్వే వంతెన పనుల్లో భాగంగా రోడ్డు విస్తరణ కోసం దేవాదాయ, రోడ్డు భవనాలశాఖ అధికారులు ముఖద్వారాన్ని కూల్చివేయించారు. గురుకులం అంటేనే ముఖద్వారం అలాంటి ముఖద్వారం కూల్చివేయడాన్ని పూర్వ విద్యార్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైల్వేగేటు వరకు వెళ్లడానికి గురుకుల్ వైపు సర్వీస్ రోడ్డు అవసరం లేకున్నా ముఖద్వారం కూల్చడమేమిటని, ఇతర నిర్మాణాలు ఉంటే ఇలాగే ధ్వంసం చేసేవారా.. అని ప్రశ్నిస్తున్నారు. కూలిన ముఖద్వారాన్ని తిరిగి పునర్నిర్మించాలనే డిమాండ్లు వినిపిస్తున్నాయి.

అభివృద్ధి చేయాలని ఉత్తరాల ఉద్యమం..

గురుకుల్‌ను అభివృద్ధి చేయాలని ఇటీవల పూర్వ విద్యార్థులు ఉత్తరాల ఉద్యమం మొదలు పెట్టారు. సీఎం, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను సహకరించాలని ఉత్తరాలు పంపుతున్నారు. ప్రభుత్వం, అధికారులు స్పందించి శిథిలమైన భవనాల స్థానాల్లో నూతన భవనాలు నిర్మించి, భూములు అన్యాక్రాంతం కాకుండా పూర్వవైభవం తీసుకురావాలని కోరుతున్నారు.

'పది'కి సన్నద్ధం !

రేపటి నుంచి ఏప్రిల్ 4 వరకు పదోతరగతి పరీక్షలు

- జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి

సాక్షి,సిటీబ్యూరో: పదో తరగతి వార్షిక పరీక్షలు ఈనెల 21 నుంచి వచ్చే నెల 4 వరకు పకడ్బందీగా నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి విజయకుమారి తెలిపారు. సైన్స్‌కు సంబంధించిన రెండు పేపర్లు మినహాయించి, మిగతా పరీక్షలు నిర్దేశించిన టైమ్‌టేబుల్ ప్రకారం ప్రతిరోజు ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు జరుగుతాయన్నారు. గ్రేస్ పిరియడ్ 5 నిమిషాలు మాత్రమే ఉంటుందని, ఉదయం 9.35 గంటల తర్వాత వచ్చిన విద్యార్థులను పరీక్ష హాల్‌లోకి అనుమతించబోమని బుధవారం ఓ ప్రకటనలో స్పష్టం చేశారు.

◆ సైన్స్ పేపర్ (పార్టు) 1,2 పరీక్షలను మాత్రం నిర్దేశించిన తేదీల్లో ఉదయం 9.30 గంటల నుంచి ఉదయం 11 గంటల వరకు నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు పరీక్షా కేంద్రాలకు ఉదయం 8.30 గంటల వరకే చేరుకునేలా ఏర్పాట్లు చేసుకోవాలని ఆమె సూచించారు. పరీక్ష కేంద్రాలను కూడా పరీక్షలకు రెండ్రోజుల ముందే గుర్తించుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

◆ మేడ్చల్, మల్కాజిగిరి జిల్లాలోని 15 మండలాల పరిధిలో పదోతరగతి పరీక్షల నిర్వహణకు 230 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేయగా, 47,930 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారన్నారు. వీరిలో 609 మంది ప్రైవేట్ విద్యార్థులు ఉన్నారన్నారు.

ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ అనుమతి లేదు..

పరీక్షా కేంద్రాల్లోకి విద్యార్థులు మొబైల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ తీసుకురావొద్దని డీఈఓ విజయకుమారి తెలిపారు. అభ్యర్థులు పరీక్ష కేంద్రాల్లోకి హాల్‌టికెట్, పరీక్షప్యాడ్, పెన్, పెన్సిల్, స్కేల్ వారి వెంట తీసుకోవచ్చన్నారు. పరీక్షల నిర్వహణకు 3,200 మంది ఇన్విజిలేటర్లతో సహా 567 మంది చీఫ్ సూపరింటెండెంట్లు (సీఎస్),డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లను నియమించామన్నారు. అన్నీ పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేశామని, వాటి పర్యవేక్షణలోనే పరీక్షలు జరుగుతాయన్నారు. 15 మంది ఫ్లైయింగ్ స్క్వాడ్‌లను నియమించడంతో పాటు కేంద్రాల సంఖ్యకు అనుగుణంగా సిట్టింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

మహిళ అదృశ్యం



సరస్వతి

మేడ్చల్‌రూరల్: ఇంటి నుండి వెళ్లిన మహిళ అదృశ్యమైన ఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్సై అశోక్ తెలిపిన వివరాల ప్రకారం.. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధి కిష్టాపూర్‌లోని అర్చనకాలనీలో నివాసం ఉండే సరస్వతి మజ్జి (22) ఈనెల 17న మధ్యాహ్నం 2గంటల సమయంలో ఇంట్లో బయటకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదు. దీంతో భర్త రాజేంద్ర మేడ్చల్ పోలీసులను ఆశ్రయించాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తైబజార్ వేలం వాయిదా

కీసర: నాగారం మున్సిపాలిటీ 2025–2026 ఆర్థిక సంవత్సరానికి బహిరంగ తైబజార్ వేలంపాటను బుధవారం నిర్వహించారు. ఈ వేలంలో ఎవరూ ఆసక్తి చూపకపోవడంతో తైబజార్ వేలాన్ని 25న మధ్యాహ్నం 12.30 గంటలకు వాయిదా వేస్తున్నట్లు నాగారం మున్సిపల్ కమిషనర్ భాస్కర్‌రెడ్డి తెలిపారు. వేలం పాటలో పాల్గొనే వారు రూ.2,00, 000లను మున్సిపల్ కమిషనర్ నాగారం పేరున డీడీ తీసి అదే రోజు ఉదయం 11.30 లోపు కార్యాలయంలో అందజేసి వేలంలో పాల్గొనాలని కోరారు.

టౌన్‌షిప్‌ను గేటెడ్ కమ్యూనిటీగా మారుస్తా

కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి వజ్రేష్‌యాదవ్

పోచారం: హౌసింగ్ బోర్డు ఏర్పాటు చేసిన సంస్కృతి టౌన్‌షిప్‌లో ప్రజలు ప్రశాంత వాతావరణంలో నివసిస్తున్నారని, దీనికెవరూ భంగం కలిగించవద్దని కాంగ్రెస్ పార్టీ మేడ్చల్ నియోజకవర్గ ఇన్‌చార్జి తోటకూర వజ్రేష్‌యాదవ్ అన్నారు. బుధవారం పోచారంలో సంస్కృతి టౌన్‌షిప్‌లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్‌స్టేషన్, ఎమర్జెన్సీ మెడికల్ కేర్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గేటెడ్ కమ్యూనిటీకి కావాల్సిన అన్ని అర్హతలు సంస్కృతి టౌన్‌షిప్‌కు ఉన్నాయన్నారు. కాంగ్రెస్ హయాంలో టౌన్‌షిప్‌నకు గేటెడ్ కమ్యూనిటీ హోదా కల్పిస్తామని చెప్పారు. టౌన్‌షిప్ మాజీ అధ్యక్షుడు వెంకటమాధవ్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలు సింగిరెడ్డి హరివర్ధన్‌రెడ్డి, వేముల మహేష్‌గౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, వెంకటేష్‌గౌడ్, బద్దం శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ వీరారెడ్డి, పోచారం ఇన్‌స్పెక్టర్ రాజు, అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ, కార్యదర్శి ఇందిరా ప్రియదర్శిని, సభ్యులు రోహిత్, దీపక్ తదితరులున్నారు.



ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్‌ను ప్రారంభిస్తున్న వజ్రేష్ యాదవ్

సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం

జవహర్‌నగర్: అసెంబ్లీలో బీసీబిల్లుకు చట్టబద్ధత, ఎస్సీ వర్గీకరణకు ఆమోదం తెలపడంపై జవహర్‌నగర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు శ్రీకాంత్‌యాదవ్ ఆధ్వర్యంలో బుధవారం జవహర్‌నగర్ ప్రధాన చౌరస్తాలో సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబుల చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలో బంగారు తెలంగాణ సాకారం అవుతుందన్నారు. మాజీ సర్పంచ్ శంకర్‌గౌడ్, మాజీ మేయర్ శాంతికోటేష్‌గౌడ్, మాజీ కార్పొరేటర్లు వేణు, లావణ్యసతీష్‌గౌడ్, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి, నాయకులు యాదగిరి యాదవ్, భాస్కర్, రమేష్‌చారి, వినయ్‌కుమార్, దయాకర్‌చారి, నర్సింహులు, మంజుల, అనంతలక్ష్మీ, సునీత రజితగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఘట్‌కేసర్: ఎస్సీ వర్గీకరణ చేసిన మొదటి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి ఎమ్మార్పీఎస్ తెలంగాణ కన్వీనర్ మల్లేష్ ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ చౌరస్తాలో వేడుకలు నిర్వహించి ఉప సంఘానికి నాయకత్వం వహించిన ఉత్తమ్‌కుమార్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. నర్సింగ్‌రావు, మల్లేష్, నర్సింహ్మా, శ్రీనివాస్, ఎం.శ్రీనివాస్, లక్ష్మీనారాయణ, నర్సింగ్‌రావు, మహిపాల్, సత్యనారాయణ, బాలయ్య, రమేష్ పాల్గొన్నారు.



జవహర్‌నగర్ చౌరస్తాలో సీఎం, మంత్రుల చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నేతలు

కలెక్టరేట్ ఎదుట ఆశావర్కర్ల ఆందోళన



సాక్షి,సిటీబ్యూరో: ఆశ వర్కర్లను పర్మనెంట్ చేయడంతో పాటు నెలకు ఫిక్స్‌డ్ వేతనం రూ.18 వేలు ఇవ్వాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు అశోక్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలని కోరారు. బుధవారం కలెక్టరేట్ ఎదుట తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో ఆశావర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు హేమలత, రేవతి కల్యాణి మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఆశాల సమస్యల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. సీఐటీయూ జిల్లా కోశాధికారి ఉన్నీకృష్ణన్, ప్రజాపాలన ప్రభుత్వంలో ఇప్పటి వరకు 300 మంది ఆశావర్కర్లతో సహా సీఐటీయూ జిల్లా నాయకులు రాజశేఖర్ లింగస్వామిలను అరెస్టు చేశారని, వారిని వెంటనే విడుదల చేయాలన్నారు. సీఐటీయూ శామీర్‌పేట్ కార్యదర్శి కృష్ణప్ప, ఆశావర్కర్లు రాధ, యాదమ్మ, లలిత, కోమలత, మంగ తదితరులున్నారు.

మనస్తాపంతో మహిళ ఆత్మహత్యాయత్నం

పోచారం: భర్తతో పాటు తనపై దాడిచేశారని మనస్తాపంతో ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. పోచారంలోని సంస్కృతి టౌన్‌షిప్‌లో నివసిస్తున్న ఉమారాణి, ఆమె భర్త రవిశంకర్‌పై టౌన్‌షిప్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు సత్యనారాయణ మరో నలుగురు దాడిచేసినట్లు పోచారం పోలీస్‌స్టేషన్‌లో ఈనెల 15న కేసు నమోదైంది. ఇదిలా ఉండగానే ఉమారాణి మనస్తాపంతో మంగళవారం అర్ధరాత్రి ట్యాబ్లెట్లు తీసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. విషయం తెలుసుకున్న స్థానికులు ఆమెను నారపల్లిలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చేర్పించి చికిత్స చేయించారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్య పరిస్థితి నిలకడగానే ఉంది. బాధితురాలితో పోలీసులు మాట్లాడి వివరాలు అడిగి తెలుసుకున్నట్లు సమాచారం.